# నాకేం అభ్యంతరం లేదు!

గంధం యాజ్ఞవల్క్య శర్మ



"సర్, రత్నమాలగారు ఫోన్ చేసి ఎస్.ఇ.గారున్నారా? అంటూ వాకబు చేశారు. మరో పది నిమిషాలలో మన ఆఫీసుకొస్తున్నా రావిడ!" హడావుడిగా ఎస్.ఇ.గారి ఛాంబర్స్‌లోకి వచ్చి చెప్పాడు స్టెనో జయరాజ్.

ఆ కబురు వింటూనే, ఏవో ఫైల్స్ చూసుకుంటున్న ఎస్.ఇ. సిరాజుద్దీన్ ఎలర్ట్ అయి "రత్నమాల గారొస్తున్నారా!" అంటూ సింహాసనంలాంటి తన కుషన్డ్ సీటులో సర్దుకు కూర్చుని .... "ఆమెగారు రాగానే లోవలకు తీసుకుని రా! అలాగే మంచి టీ ... కాదు, కూల్ డ్రింక్స్ పంపించు!" అన్నాడు.

లోపలికి వచ్చినంత కంగారుగానే స్టెనో జయరాజ్ రెసెప్షన్‌లోకి వెళ్లిపోయాడు.

రత్నమాల ఎందుకొస్తోందో అర్థమయింది సిరాజుద్దీన్‌కు. శాంక్షనై వచ్చిన నామినేషన్ పనులలో ఒక్క దానిని కూడా రత్నమాలగారికి ఇవ్వలేకపోతున్నందుకు ఆమెకెలా నచ్చచెప్పాలో ఆలోచనలో పడిపోయాడు.

అతి జరూరుగా పూర్తిచేయవలసిన పది పదిహేను లక్షల విలువగల రోడ్డు ఫార్మేషన్ పనులు ఓ డజను, టెండర్స్ పిలవటంలాంటి లాంఛనాలతో నిమిత్తం లేకుండా ఎస్.ఇ.

విచక్షణతో, కాంట్రాక్టర్లకు నామినేషన్ మీద ఇచ్చేందుకు మంజూరైన వచ్చాయి ప్రభుత్వం వారినుండి, వారం రోజుల క్రిందట. చాలాభాగం వాటిలో మట్టిపనులు. సగానికి సగంపైనే లాభాలుంటాయి.

ఆనాడే "హలో! సిరాజుద్దీన్ సాబ్!" అంటూ ఫోను చేసి, "ఏవో నామినేషన్ వర్క్స్ వచ్చాయుట! అని వాకబు చేసింది రత్నమాల. అప్పుడే ఎలా తెలుసుకుందో ...

"అవును!" అంటూ వివరాలు చెప్పాడు.

"వాటిలో కనీసం అరడజను పనులన్నా నాకివ్వాలి. తెలుసుగా, వచ్చే నెలలో మన మంత్రిగారికి ఈ శాఖలో తన పదవీకాలాన్ని సంవత్సరం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సన్మానం. అది భారీగా జరగాల్సి ఉంది. మరి, ఆ భారం, బాధ్యత మనమీదనే ఉన్నాయి. ఏర్పాట్ల బాధ్యత మీది. ఆర్థిక భారం నాది. ఏమంటారు ..." అంది.

"అలాగే!" అని మాటిచ్చాడు తాను. ఈ దెబ్బతో సి.ఇ. ప్రమోషన్ ఫైలును రత్నమాలగారి అండతో గవర్నమెంట్‌లో కదిపించాలి అనుకున్నాడు కూడా.

రత్నమాల ప్రభుత్వంలో చాలా పలుకుబడిగల వ్యక్తి. ఏ క్లాసు కాంట్రాక్టరు. రోడ్ల భవనాల శాఖ మంత్రిగారి నియోజకవర్గపు మనిషే కాదు, ఆయన అనుచరవర్గంలో అతి ముఖ్యురాలు కూడా. అసలు ఆయన ఇలాకా మనిషంటారు. అంతేకాదు ... ఆమెగారి అసలు అస్త్రం ఆమె రూపం.

ఆకర్షణీయమైన గులాబి రంగు మేని ఛాయ, కొనదేరిన ఆ ముక్కు ... అంత పొడగరి కాకున్నా, చూసేవారికి ఎందుకో అలా అనిపిస్తుంది. ఆ ఎత్తుకు తగ్గ రూపం. ఆ రూపానికి తగ్గ ఆ శరీర సౌష్టవం. సదా చిరునవ్వులు కురిపిస్తూ, ఎదుటివారిని ఇట్టే ఆకట్టుకునే ఆ లావణ్యం ... ఆకట్టుకునే అనేకంటే కట్టిపడవేసే లావణ్యం అనటం న్యాయం.

నామినేషన్ ఎవరెవరికి కేటాయించాలి అనేది తన విచక్షణకు లోబడిన అంశం కాబట్టి, అరడజను వర్క్స్ రత్నమాలకు ఇస్తానని మాట ఇచ్చాడు తా నానాడు. కానీ, ఊహించని ముప్పొకటి ముంచుకొచ్చిందిప్పుడు. కార్మిక సహకార సంఘాలను ప్రోత్సహించేందుకు ఒక విధాన నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, నామినేషన్ మీద ఇవ్వవలసిన వర్క్స్ అన్నింటినీ ఆ కార్మిక సహకార సంఘాలకు కేటాయిస్తూ జి.వో. ఒకదానిని విడుదల చేసింది. ఆ జి.ఓ.ను ఎలాంటి మినహాయింపులూ లేకుండా అమలు జరపాల్సిందేనంటూ చాలా కఠినమైన ఉత్తర్వులను జారీచేసింది. క్రిందటి దినమే ఆ ఉత్తర్వులు వచ్చాయి.

ఈ పాటికే ఈ విషయం తెలుసుకున్న కార్మిక సహకారసంఘాలవారు ఆ వర్క్స్ మాకంటే మాకంటూ వచ్చి కూర్చున్నారు తన ఆఫీసులో. తన ఆఫీసుకు వస్తున్న రత్నమాలకు ఆ వర్క్స్ ఆమెకి ఇవ్వలేననే విషయం ఎలా నచ్చచెప్పాలో అర్థం కాలేదు సిరాజుద్దీన్‌కు.

గతంలో చాలా సందర్భాలలో రూల్సుకు వ్యతిరేకమైన చాలా విషయాలలో "రూల్సు ఎందుకయ్యా ఉంది మార్చుకోవటానికేగా! ఎలా చేస్తావో ... ఏం చేస్తావో నాకు తెలియదు. నా పని కావాల్సిందే!" అంటూ మొండిపట్టు పట్టి మెడలు వంచి పనులు చేయించుకుంది రత్నమాల. కానీ ఈసారి ... ఎలా ... తానేమాత్రం, పై జి.ఓ.కు భిన్నంగా వ్యవహించినా కార్మిక సంఘాలవారు ఊరుకోరు.

తన మారుతీ కారులో వచ్చి దిగి, సరాసరి ఎస్.ఇ. గదిలోకి వచ్చేసింది రత్నమాల. రత్నమాలను చూస్తూనే లేచి నుంచుని "రండి!" అంటూ ఆహ్వానించి ఆమె కూర్చునేందుకు కుర్చీ చూపించాడు ఎస్.ఇ. సిరాజుద్దీన్. అటెండరు తెచ్చిన కూల్‌డ్రింక్స్ తాగాక ...

"ఆ నామినేషన్ వర్క్స్ ఎలాట్ చేసి వర్క్ ఆర్డర్లు పంపిస్తారనుకున్నాను!" అంది రత్నమాల చాలా కూల్‌గా.

సిరాజుద్దీన్ చాలా అపాలజిటిక్‌గా మొహం పెట్టి "సారీ, రత్నమాలగారూ! ఆ వర్క్సును సహకార కార్మిక సంఘాలకు కేటాయిస్తూ ఆర్డర్సు వచ్చాయి. మై హేండ్స్ ఆర్ టైట్ నౌ!" అన్నాడు.

"అవును. అలాంటి ఆర్డర్సు వచ్చాయని విన్నాను" అంది రత్నమాల చాలా శాంతంగా..

రత్నమాల ప్రసన్న సంభాషణకు సిరాజుద్దీన్ గాలి పీల్చుకున్నాడు.

"మీరంటున్నట్లు ఆర్డర్లు అదే ఆ వర్క్సుని సహకార కార్మిక సంఘాలకు కేటాయించిన ఆర్డర్లు నిన్న వచ్చాయనుకుంటాను. అవి రాకముందే, ఆ వర్క్సుని ఎలాట్ చేసి ఉన్నట్లయితే ఈ చిక్కు వచ్చేది కాదుగా! ఇన్ని రోజులు ఎందుకు ఆలస్యం చేసినట్లు?" ప్రశ్నించింది.

సిరాజుద్దీన్ ఇబ్బందిగా మొహం పెట్టాడు ఏం సమాధానం చెప్పలేక. తన పై అధికారులు కూడా తననిలా సంజాయిషీ అడగరు.

"వెరీ సారీ! ఏవో పనుల ఒత్తిడివల్ల ఆలస్యం జరిగింది. ఇంతలోనే ఈ జి.ఓ. వచ్చింది."

"నాకు మాట ఇచ్చారు. సారీ చెప్పి ప్రయోజనం లేదు. ఏం చేస్తారో ఎలా చేస్తారో నాకు తెలియదు. అరడజను వర్క్స్ నాకు ఇవ్వవలసిందే!" చాలా నిక్కచ్చిగా మాట్లాడింది. ఆమె మోముపై కనిపించీ కనిపించని జేవురింపు; కనులలో చిన్న రక్తపు చారికలను గమనించిన సిరాజుద్దీన్ కలవరపడుతూ

"అదే, ఎలాగా.. నా..." అని అన్నాడు నీళ్లు నములుతూ.

"ఎలాగా అన్నది మీరాలోచించుకోవలసిన విషయం. మంత్రిగారి సన్మానం ఆగిపోతే బాధ్యత మీదే అవుతుంది!" అంది రత్నమాల.

సిరాజుద్దీన్ కంగారుగా చూశాడు.

అప్పుడు ఎస్.ఇ.గారికి పక్కగా నిల్చుని ఉన్న స్టెనో, జయరాజ్ కల్పించుకుని, "క్షమించండి, మేడమ్! ఒక పని చేస్తే సరిపోతుందనుకుంటాను!" అన్నాడు. అతనికి రత్నమాల దగ్గర ఆ మాత్రపు చొరవుంది.

'ఏమిటి?' అన్నట్లు చూసింది రత్నమాల. సిరాజుద్దీన్ కూడా ఆసక్తిగా చూశాడు జయరాజ్‌కేసి.

"ఈ సహకార సంఘాలు చాలావరకూ బోగస్ సంఘాలే. అవి ఏకవ్యక్తి సంఘాలు. వారి దగ్గర పెట్టుబడికి డబ్బుండదు. పని చేసే సామర్థ్యమూ ఉండదు. ప్రభుత్వం వారిచ్చే రాయితీలకోసం, సదుపాయాలకోసం, బినామీ పేర్ల సభ్యత్వంతో ఏర్పడ్డవే ఈ సంఘాలు. వాటినడ్డం పెట్టుకుని కొందరు కాంట్రాక్టర్లే ఈ పనులను, చేపట్టి చేసుకుంటూ ఉంటారు.

"మీరు అలాంటి ఒక అనామక సంఘాన్ని ఒకదానిని పట్టుకుని, దానిపేర ఈ నామినేషన్ వర్క్సుని ఎలాట్ చేయించుకుంటే అటు జి.ఓ. లక్ష్యాన్ని అతిక్రమించినట్లు కాదు, ఇటు మీకూ పనులు దక్కుతాయి!" అన్నాడు జయరాజ్.

> "నీతో బేరం ఆడను. నీ ఋణం ఉంచుకోను.
> నీకు ముట్టవలసినదానికంటే ఎక్కువే ముట్టేలా చేస్తాను.
> నిన్ను సంతోషపెడతాను. సరేనా!" అంది.

క్షణం కనులు చికిలించి ఆలోచించి "అలాంటి సంఘం ఏదైనా, దొరుకుతుందా మనకు?" ప్రశ్నించింది రత్నమాల.

"కష్టమేమీ కాదు. ఎవరినో ఒకరిని పట్టుకోవచ్చు. కాకుంటే ఆ బినామీ సంఘం ప్రెసిడెంట్‌కు ఏదో కొంత ముట్టచెప్పగలిగితే ..."

"అది సరే ... అలాంటి ప్రెసిడెంట్ ఎవరైనా నీ ఎరికలో ఉన్నాడా?" సూటిగా ప్రశ్నించింది.


క్షణం ఆలోచించి "ఆఁ... ఉన్నాడు. కుంటి గోవిందు!" అన్నాడు జయరాజ్.

"కుంటి గోవిందా?"

"అదే ... అతని పేరు గోవిందరావు. అతడితో ఒక అండర్‌స్టాండింగ్‌కొస్తే ..."

"నాకభ్యంతరం లేదు. అతగాణ్ణి నా దగ్గరకు చేర్చే బాధ్యత నీదీ!" అంది రత్నమాల స్టెనో జయరాజ్‌తో.

'అవును, ఆ బాధ్యత నీదే' అన్నట్లు




చూశాడు ఎస్.ఇ. సిరాజుద్దీన్ కూడా జయరాజ్‌కేసి.

***

అతని పేరు గోవిందరావు.

గోవిందరావు అంటే ఎవరికీ తెలియదు. 'కుంటి గోవిందు' అంటే చాలామందికి తెలుసు. అతను కుంటివాడేం కాదు. నడుస్తున్నప్పుడు ఎందుకో ఒక పక్కకి వంగి నడుస్తాడు. బహుశా అతని ఎడం కాలు కొంచెం పొట్టేమో!

అతనిది ఆ పట్టణానికి దగ్గరలో ఉన్న ఒక గ్రామం. అతడు ఆ గ్రామంలోనే ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఏడు వరకు చదివాడు. పాసవలేదు. దానితో అతని చదువు ఆగిపోయింది. తండ్రి మిగిల్చిన రెండెకరాల మాగాణి భూమిని సేద్యం చేసుకుంటూ ఉండిపోయాడు.

పెండ్లి చేసుకోవాలనుకున్నాడు. అతనికి అప్పటికే 'కుంటి గోవిందు' అని పేరొచ్చింది. పైగా మనిషి కొంచెం పొట్టి. నల్లని నలుపు. మొహాన స్ఫోటకపు మచ్చలు. పైగా ఆస్తిపాస్తులు నామమాత్రం కావటంతో 'పిల్లనిస్తా'మని ఎవరూ ముందుకు రాలేదు.

అతినికి ఆ ఊరన్నా, వ్యవసాయం అన్నా విసుగేసింది.

అదిగో ఆ సమయాన తనతో చదివిన ఆ ఊరి మునసబుగారి మేనల్లుడు శీను కలిశాడు. అతగాడూ తనలా ఏడవక్లాసు తప్పినవాడే. కానీ పక్కనున్న పట్టణంలో ఏదో వ్యాపారం పెట్టి, ఒకటి రెండు సంవత్సరాలలోనే మస్తుగా ఆర్జించి పైలాపచ్చీసులా మోటారు సైకిల్‌పై తిరుగుతున్నాడు.

"ఏరా గోవిందు ... ఏం చేస్తున్నావు?" అన్నాడు శీను.

"ఏం చేస్తాను ... వ్యవసాయమే!" అన్నాడు గోవిందు.

"ఎన్నాళ్లు మట్టి పిసికితే, ఏం మిగులుతుంది ... బస్తీ చేరి ఏం చేసుకున్నా హాయిగా బతకవచ్చు!" అని సంపాదించి బాగుపడాలంటే మొదటి మెట్టు బస్తీ చేరటం అనే సూత్రాన్ని చెప్పాడు శీను.

అంతే! తన రెండెకరాల చెక్కను తెగనమ్మి బస్తీ చేరాడు గోవిందు. తీరా అక్కడకు చేరాక కానీ తెలిసిరాలేదు బస్తీలో సంపాదనావకాశాలు చెట్లకు కాసినట్లేం కాసిలేవని.

బస్తీ చేరిన గోవిందు ఏవేవో చిన్నా చితకా పనులు చాలా చేశాడు. కిళ్లీబడ్డీ, కొబ్బరిబొండాల వ్యాపారం, బియ్యపు కొట్టు, అరటికాయ వ్యాపారం, కూరగాయల మార్కెట్టులో కమీషన్ కొట్టు ... ఇలా ఒకటి తరువాత ఒకటి .... ఏదీ కలసిరాలేదు.

ఆస్తి అమ్మి తెచ్చుకున్నదంతా చిన్నచిన్నగా కరిగిపోయింది. ఇక కూలీగా మారవలసిన స్థితిలో స్నేహితుడు శీను కనిపించి గోవిందు కథంతా విని ...

"పొరపాటు చేశావు. సొంత పెట్టుబడి పెట్టి వ్యాపారాలు చేస్తారా ...! పెట్టుబడి లేని వ్యాపారాలు చాలా ఉన్నాయ్!" అంటూ ఒక బినామీ కార్మిక సహకార సంఘాన్ని, గోవిందు ప్రెసిడెంటుగా రిజిస్టర్ చేయించి పెట్టి, "దీనితో బతుకు!" అన్నాడు.

ప్రభుత్వం కార్మిక జనంపట్ల శ్రద్ధ కనపరుస్తోంది అనటానికి నిదర్శనంగా కార్మిక సంఘాలను నెలకొల్పి, వాటికి కొన్ని రాయితీలు, వెసులుబాట్లు కల్పిస్తోంది. ఆ సంఘాలు అందరి కాంట్రాక్టర్ల మాదిరిగా టెండర్లలో పాల్గొనటానికి డిపాజిట్లు కట్టవలసిన పని లేదు. సాల్వెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వనవసరంలేదు. అంతేకాదు, ప్రభుత్వమే కొంత వడ్డీ లేని అప్పు కూడా ఇస్తుంది.

ఈ వెసులుబాటు వలన, చాలా బోగస్ కార్మిక సహకార సంఘాలు వెలసి, అవి నిజమైన కాంట్రాక్టర్లకు పోటీ అయి కూర్చున్నాయి. వీటి అడ్డంకి తొలగించుకోవటానికి ఈ సంఘాల ప్రెసిడెంట్లకు కాంట్రాక్టర్లు కొంత సొమ్ము ముట్టజెప్పి, వారిని పోటీనుండి తప్పించటమో, లేకుంటే ఈ సంఘాలపేరును అడ్డం పెట్టుకుని బినామీగా ఆ కాంట్రాక్టు పనులను చేపట్టడమో జరుగుతోంది.

ఈ రెండు సందర్భాలలోనూ కార్మిక సహకార సంఘ ప్రెసిడెంట్లకు, ఎలాంటి శ్రమా లేకుండా తృణమో, ఫణమో ముడుతుంది.

అదిగో, అలా గోవిందరావు, ఉరఫ్ కుంటి గోవిందు, తన చేతిలో ఉన్న ఆ కార్మిక సహకార సంఘాన్ని ఆసరా చేసుకుని పెద్దగా కాకున్నా, తనకు తినా, కుడవా సరిపడ నాలుగు రాళ్లు సంపాదించుకోగలుగుతున్నాడు.

ఆ గోవిందును గురించే రత్నమాలకు జయరాజ్ చెప్పింది.

***

ఆ మరునాటి ఉదయాన్నే 'ఏ'క్లాస్ కాంట్రాక్టర్ రత్నమాలగారి మారుతి జెన్ గోవిందును వెతుక్కుంటూ ఎక్కడో, టౌను మారుమూల ఒక చిన్న అద్దెకొంపలో ఉంటున్న అతగాడి ఇంటిముందుకొచ్చి ఆగింది.

"రత్నమాలగారు నిన్నొకమారు కారెక్కించుకు రమ్మన్నారు!" అన్నాడు, ఆ కారులో వచ్చిన స్టెనో జయరాజ్ గోవిందుతో.

గోవిందుకు రత్నమాల ఎవరో తెలుసు. ఆమె స్థాయి ఏమిటో తెలుసు. తనకు సాక్షాత్తూ రత్నమాల నుండి పిలుపా! ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. నిజమా...!

నిజమే అన్నట్లు రత్నమాలగారి మారుతీ జెన్ తన ఇంటిముందు ఆగి ఉంది దేవేంద్రుడు పంపిన పుష్పక విమానంలా.

ఏమనాలో అర్థం కాక "ఎందుకు?" అని అడిగాడు గోవిందు.

"మారు మాటాడక ... బయలుదేరవయ్యా, గోవిందూ! రత్నమాలగారి దృష్టిలో పడ్డావు. నీ రొట్టె విరిగి నేతిలో పడ్డది!", అన్నాడు జయరాజ్.

గోవిందును మారుతీ జెన్ వేగంగా మోసుకెళ్లి రత్నమాల బంగళాముందు దింపింది. ఈలోగా దారిలో విషయం అంతా చెప్పి "ఇందుకు నీవు ఒడబడ్డావో రత్నమాల కరుణకు పాత్రుడవవుతావు. ఆపైన నీకు మహారాజయోగం పట్టినట్లే!" అని చెప్పాడు జయరాజ్.

గోవిందుకు భయమూ, సంతోషమూ వేశాయి. కాంట్రాక్టర్ల ప్రపంచంలో చక్రవర్తిని రత్నమాల. ఆమెతో వ్యవహారం సుమీ అన్న భయం ... ఆ చక్రవర్తిని దగ్గర తాను డిప్యూటీ చక్రవర్తిలాంటి పదవి పొందబోతున్నందుకు సంతోషం.

తన ఏ.సి., గదిలో భద్రసింహాసనంలాంటి కుషన్డ్ కుర్చీలో కూర్చుని పేపరు చూస్తోంది రత్నమాల. ఆ సమయాన ఆ గదిలోకి వచ్చిన గోవిందును చూస్తూనే చదువుతున్న పేపరును పక్కన పడేసి, "రండి, కూర్చోండి!" అని సోఫా చూపింది గోవిందుకు రత్నమాల.

వినయాన్ని, విధేయతను రంగరించి, తలవంచి నమస్కరించి కూర్చోక నిలబడే ఉండిపోయాడు గోవిందు.

"ఫరవాలేదు, కూర్చో!" అందీసారి రత్నమాల. బహువచనం ఇకడికి అనవసరం అనుకున్నట్లుంది.

అరకొరగా కూర్చున్నాడు గోవిందు సోఫాపై.

"విషయం జయరాజ్ చెప్పే ఉంటారు!" అంది గోవిందు మొహంలోకి చూస్తూ.

"చెప్పారు!" అన్నాడు గోవిందు.

"నేను చాలా నిక్కచ్చి మనిషిని. నా భాగస్తులూ అలా ఉండాలనే అనుకుంటాను. నీ సంఘం పేరుపై పనులు తీసుకుందాం. పెట్టుబడి నాది. పనులు పూర్తి చేయించటం, చెక్‌మెజర్‌మెంట్లు చేయించుకోవటం, బిల్లులు తెప్పించుకోవటం అంతా నా పూచీనే! కాకుంటే బిల్లులు నీ పేరున అదే సంఘ ప్రెసిడెంట్‌గా నీ పేరున ఉంటాయి. వాటిని మార్చి నాకివ్వటం నీవంతు. ఆ సంఘపు దొంగ లెక్కలేవో రాయించుకోవటం నీ బాధ్యత!

"ఇందుకుగాను నీ షరతులేమిటి?" సూటిగా ప్రశ్నించింది రత్నమాల.

'నేను చాలా నిక్కచ్చి మనిషిని నా భాగస్తులూ అలానే ఉండాలి' అన్న రత్నమాల మాటలలోని... తననో భాగస్తునిగా గుర్తిస్తున్న భావం గోవిందుని ఉక్కిరిబిక్కిరి చేసింది. వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాడు.

"చెప్పు ... ఫరవాలేదు!" అంది రత్నమాల. అలా అంటున్నప్పుడు ఆమె మోముపై చిన్న చిరునవ్వు మెరిసింది. తనపై ఎంతటి ఉదారతో కురిసినట్లనిపించింది గోవిందుకు.

"మీ ఇష్టం ... మీ రెట్లా అంటే అట్లాగే!" అన్నాడు గోవిందు.

"భేష్!" అంది రత్నమాల మెచ్చుకోలుగా.

"నాకు ఇలాంటి మనుషులంటేనే చాలా ఇష్టం. నాతో నీవు బేరం ఆడలేదు. నేనూ అంతే! నీతో బేరం ఆడను. నీ ఋణం ఉంచుకోను. నీకు ముట్టవలసినదానికంటే ఎక్కువే ముట్టేలా చేస్తాను. నిన్ను సంతోషపెడతాను. సరేనా!" అంది.

గంగిరెద్దు కూడా అంత సొగసుగా తల ఆడించదు. అలా తలాడించాడు గోవిందు.

***

సిరాజుద్దీన్ అరడజను రోడ్డు ఫార్మేషన్ వర్క్స్‌ను గోవిందు కార్మిక సహకార సంఘానికి కేటాయించాడు. ఆ మొత్తం పనుల విలువ దగ్గరదగ్గర కోటి రూపాయలు. పనులు ప్రారంభమయ్యాయి.

"నీ వింక అక్కడెందుకు, నా కందుబాటులో ఉండాలిగా!" అని గోవిందు నివాసాన్ని తన బోట్‌హౌస్‌కు మార్చివేయించింది రత్నమాల. తన చెంత చేరిన కొద్దికాలంలోనే గోవిందు వేషభాషల్ని కూడా మార్చింది రత్నమాల. ఆ ముతకపంచల, మాసిన చొక్కాల స్థానంలో ఓ డజను పొందూరు ఖద్దరు ధోవతులు, నెహ్రూ మెడ లాల్చీలు భుజంపైకి పేటంచు కండువాలు వచ్చి చేరాయి.

రత్నమాల ఏ ఆఫీసుకు వెళ్తే అక్కడకు ఆమెతోపాటే ఆమె వాడే ఏ.సి. కారులో చేతిలో ఒక బ్రీఫ్‌తో గోవిందూ కనిపించడం మొదలైంది. ఇతర పట్టణాలకూ, రాజధానికీ వెళ్లినప్పుడు రత్నమాలతో పాటు గోవిందుకూ ఫైవ్ స్టార్స్ హోటళ్ల తిండి, నివాసం దొరికాయి.

పెద్దపెద్ద ఇంజనీర్లకు, ఆఫీసర్లకు రత్నమాల గోవిందును, "నా వ్యాపారంలో భాగస్తుడు!" అని పరిచయం చేసేది.

సంఘంలో గోవిందు హోదా పెరిగింది.




అంతా అతనినిప్పుడు గోవిందుగారూ అని మన్నన చేయటం ప్రారంభించారు.

ఒక్క రత్నమాలే తనను గోవిందూ అని పిలుస్తుంది. అది ఆమె అతనిపట్ల నెరపే ఆత్మీయత, ఆదరణలకు నిదర్శనం.

గోవిందుకు ఈ మార్పంతా ఒక చిత్రమైన కలగా అనిపించేది. సంవత్సరం గడిచేపాటికి ఆ అరడజను పనులే కాదు, మరో విడత వచ్చిన నామినేషన్ పనులలో ఎక్కువ పనులను ఈ సంఘం ద్వారానే తీసుకుంది రత్నమాల.

ఆ సంవత్సరంలో కోటి రూపాయలు నికరాదాయం వచ్చింది రత్నమాలకు. గోవిందుకు దైనందికంగా కావలసినవన్నీ, తిండి, బట్ట, అప్పుడప్పుడూ మందు, కార్లమీద తిరగటంలాంటివాటికి వేటికీ లోటు లేకుండా,

సమకూర్చబడుతూనే ఉన్నాయి అతి శ్రద్ధగా.

గోవిందు కూడా అంతటి శ్రద్ధతోనూ, ఆ శ్రద్ధకు వినయాన్ని కూడా జోడించి సంఘపు పేరిట వచ్చిన ప్రతి బిల్లుపై సంతకం పెట్టమన్న చోటల్లా పెట్టి అందిస్తూనే ఉన్నాడు రత్నమాలకు క్షణం తటపటాయించకుండా.

కానీ ఏనాడూ లాభంలో నీ భాగం ఇది అని రత్నమాల చెప్పనూ లేదు గోవిందుకు ఇవ్వనూలేదు.

'నా వాటా సంగతేం మాట్లాడదేం?' అని చాలా మౌనంగానే ఒకటి రెండుసార్లు తనలో తానే ప్రశ్నించుకున్న గోవిందు ఏదో ఒకనాడు ఎందుకు 'ఇవ్వదులే' అని సరిపెట్టుకునేవాడు అంత మౌనంగానే.

***

రత్నమాల ఇలాకా రోడ్లు భవనాల శాఖ మంత్రిగారిని అధిష్ఠానం కేంద్రానికి పిలిపించుకుంది. ఖాళీ వచ్చిన పార్లమెంటు సీటుకు బై ఎలక్షనులో పోటీ చేయించి గెలిపించుకుని కేంద్ర మంత్రివర్గంలో రైల్వే మంత్రి పదవి ఇచ్చింది.

తనకు పోటీగా ఎదుగుతున్న రోడ్లు భవనాల శాఖ మంత్రిని వదిలించుకోటానికి అధిష్ఠానంతో మంతనాలు జరిపి రాష్ట్ర ముఖ్యమంత్రిగారు చేయించిన మార్పిది.

తాను కేంద్రానికి వెళ్తూనే, "అక్కడేం ఉంది మట్టి పనులేగా ... ఇక్కడ నా చేతిలో దేశాన్నంతా కొల్లగొట్టుకోవటానికి పీకేస్తున్న మీటర్‌గేజ్ ఇనుము బోలెడుంది, రా!" అంటూ రాజధానికి ఆహ్వానించాడు ఆ మంత్రివర్యుడు రత్నమాలను.

రత్నమాల దేశ రాజధానికి మకాం మార్చటానికి సిద్ధమైంది. సామానులు కూడా మంత్రిగారి శాఖ గూడ్సుబండిలో రాజధానికి కదిలి వెళ్లాయి. తన భవనాన్ని ఎవరో పెద్ద పారిశ్రామిక వేత్తకు అమ్మివేసింది.

ఔట్‌హౌస్‌ను ఖాళీ చేసిన గోవిందు రాజధానికి బయలుదేరనున్న రత్నమాలను కలుసుకుని,

"మీరు వెళ్లిపోతున్నారు, మరి నా సంగతేమిటి?" అన్నాడు.

"నీ సంగతా ... ఏమిటి నీవనేది?" అంది అదోలా నవ్వుతూ.

"లాభాలలో నాకంటూ ఏమీ ఇచ్చారు కాదు..." నీళ్లు నిమిలినట్లు మాట్లాడాడు.

రత్నమాల ఈసారి నవ్వలేదు. "నీకు రావలసినదేమైనా ఉందా?" కళ్లు చికిలించి ప్రశ్నించింది.

"మీరే అన్నారుగా నాకు ముట్టవలసినదానికంటే ఎక్కువే ముట్టచెపుతానని!"

"అవును, అన్నాను. అంతేకాదు, నిన్ను సంతోషపెడతానని కూడా అన్నాను. నేను చాలా నిక్కచ్చి మనిషిని. అన్నదానిని ఆచరించే మనిషిని. చూడు, గోవిందూ! నీవు నా దగ్గరకు రాకముందు నీ స్థితి ఏమిటి? ఈ సంఘాన్ని అడ్డుపెట్టుకుని, జీవనానికి చాలీ చాలని నాలుగు రాళ్లు సంపాదించుకుంటూ, ఊరికి చిట్టచివర, ఒక సగం కూలిన అద్దె కొంపలో ముతక పంచలు, మాసిన చొక్కాలతో బ్రతుకీడుస్తూ ఉండేవాడివి. అలాంటి నీవు నా భవనంలోకి వచ్చి పడ్డావు. పొందూరు ఖద్దరు బట్టలు కట్టావు. నాతో సమానంగా కూర్చుని నా కార్లలో తిరిగావు. కడుపునిండా తిన్నావు. ఫైవ్ స్టార్ హోటళ్లల్లో మకాం చేశావు. కావలసినప్పుడు తాగావు. నిన్ను కుంటి గోవిందు అని పిలిచేవాళ్లంతా గోవిందుగారూ అంటూ పిలిచారు.

"ఇవన్నీ నీకు లభ్యమౌతాయని ఏనాడైనా నీవు కలలోనైనా ఊహించావా ... అలాంటి నీకు ఇవన్నీ నా మూలంగానేగా ముట్టాయి! అంటే, నీకు ముట్టవలసినదానికంటే ఎక్కువే ముట్టినట్లు కదూ!

"అంతే కాదు, మరో సంగతి! నీవు నావెంట అహర్నిశలూ నా కారులో, నాతో సమానంగా కూర్చుని తిరగటం, నా బంగళాలోనే ఉండిపోవటం, నేను నిన్ను నా భాగస్తుడిగా చెప్పుకోవటం చూసి కొందరు సామాన్యులు ఏమనుకున్నారో తెలుసా ...

"అంతెందుకు నీ పాత మిత్రులు ... అదే మీ ఊరి మునసబుగారి మేనల్లుడిలాంటి వారు ... 'ఏరా గోవిందూ! రత్నమాలకే లైన్ వేశావటగా!' అన్నప్పుడు 'ఛా...ఛా! అలా అనకండి! అపచారం!' అని లెంపలు వేసుకోవాల్సింది పోయి నీవేం చేశావు ... ముసిముసి నవ్వులు నవ్వి, వాళ్ల మనసుల్లో 'ఇదేదో నిజమేలాగుందే' అనే భావాన్ని కలిగించి నీలో నీవు సంతోషించావు. అవునా, కాదా?

"ఈ విషయాలన్నీ నాకు ఎప్పటికప్పుడు తెలుస్తున్నా సహించి ఊరుకున్నాను. ఎందుకో తెలుసా ... నిన్ను సంతోషపెడతాను అన్నాను కాబట్టి. పోనీలే సంతోషపడుతున్నాడు పడనీయ్ అని సహించాను. అలా నేను సహించకపోయినట్లయితే ... ఏమయ్యేది?

"నీ శరీరం ఏనాడో ఏ బుల్‌డోజర్ క్రిందనో నలిగిపోయేది. లేకుంటే నీ శవం ఏ కెనాల్‌లోనో తేలేది. ప్రమాదవశాత్తు పాపం, ప్రాణాలు కోల్పోయాడు అనుకునేవారంతా. అలాంటి ప్రమాదం నుండి నిన్ను తప్పించిందెవరు? నేనే కదా ... అంటే నీకు ప్రాణదానం కూడా చేశానన్నమాట. ఈ రాయితీ నీకు అదనంగా ప్రసాదించిందే కదూ!

"ఇప్పుడు నీకు మరో జీవితాంతపు బోనస్‌లాంటి అవకాశం కల్పిస్తున్నాను. ఇక నీ శేష జీవితమంతా, నీ-నా సంబంధాన్ని గురించి, ఎవరేం ప్రశ్నించినా అలా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ సంతోషిస్తూ ఉండిపో! నాకేం అభ్యంతరం లేదు, సరేనా!" అంది రత్నమాల.

ఆ మరునాడే రైల్వే మంత్రిగారి పంపున రిజర్వు కాబడిన ఏ.సి. స్పెషల్ కూపేలో ఎక్కి రత్నమాల రాజధాని చేరింది. ■

